# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 142 — శనివారం | 02 డిసెంబర్ 2023 | పేజీలు : 06 | వెల రూ. 5





6లో..

## ఎగ్జిట్ పోల్స్ పై అనుమానాలు

- వాటిలో శాస్త్రీయత ఎంత అన్నది ప్రశ్నార్థకమే
- కాంగ్రెస్‌లో ఉత్తేజం
- అధికారం మనదే అంటున్న బీఆర్ఎస్
- కేబినెట్ సమావేశంపై ఉత్కంఠ

రేపు ఓట్ల లెక్కింపు

ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

ఎప్పటికప్పుడు ఫలితాలు ప్రకటించేలా విస్తృత ఏర్పాట్లు




# కింగ్ ఎవరూ..?



## అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్



రాష్ట్ర వ్యాప్తంగా రేపు నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుతో 'కింగ్' ఎవరనేది తేలనుంది. మొత్తం 119 నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు పలువురు ఇండిపెండెట్లు పోటీ పడ్డారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన వీరి భవితవ్యం ఆదివారం బహిర్గతం కానుంది. అయితే అధికామే లక్ష్యంగా పోటీ పడిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఫలితాలు ఎవరికి అనుకూలంగా వస్తాయి.. ఎవరు విజేతలు.. ఎవరు పరాజితులు అన్న ఆందోళన కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 49 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో 12 నియోజకవర్గాలకు చెందిన ఓట్లను లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలనుంచే ప్రారంభం కానున్న కౌటింగ్‌కు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో కౌంటింగ్ కేంద్రాలవద్ద మూడంచెల భద్రత పెట్టారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటించేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..



## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

2లో..



## ఘనంగా అయ్యప్ప పడిపూజ

తరలి వచ్చిన భక్తులు

2లో..

# కింగ్ ఎవరూ..?

## అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్

### రేపు ఓట్ల లెక్కింపు

### ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్

### కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

### ఎప్పటికప్పుడు ఫలితాలు ప్రకటించేలా విస్తృత ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో తెలుసుకోవాలని ఆతృత పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పడిన 2,290 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో నిక్షిప్తమై ఉంది. నువ్వా..నేనా అన్నట్లు సాగిన పోరులో విజేతలెవరనేది ఆదివారం తేలనుంది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభకానుండగా 10 గంటలకు తొలి ఫలితం వెలువడనుంది. ఈవీఎంలు భద్రపరిచిన గదుల దగ్గరకు ఎవరినీ అనుమతించడం లేదు.డీసీపీ స్థాయి అధికారితోపాటు ఇద్దరు సీఐలు, నలుగులు ఎస్ఐలతో పాటు కేంద్ర బలగాలు స్ట్రాంగ్ రూంల దగ్గర పహారా కాస్తున్నాయి. మొత్తం 40 కంపెనీల కేంద్ర బలగాలను ఈవీఎంల దగ్గర బందోబస్తు విధుల్లో ఉంచారు. అయితే కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. ఉదయం 5గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది చేరుకోనున్నారు. లెక్కింపునకు ముందు గంటపాటు ఉద్యోగులకు దిశ నిర్దేశం చేయనున్నారు. ఆర్వో ధృవీకరించిన తర్వాత 20 నిమిషాల్లో ఒక్కో రౌండ్ ఫలితం వెలువడనుంది. వేగంగా ఫలితాలు ఇచ్చేందుకు ప్రత్యేక సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేశారు.

### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు చెందిన ఓట్లను ఐదు ప్రాంతాల్లో లెక్కించనున్నారు. వరంగల్ తూర్పు, పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్నారు. అదే విధంగా మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు చెందిన ఓట్లను మహబూబాబాద్ జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో, జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల కౌంటింగ్ ను జనగామలోని విద్యాభారతి ఇంజనీరింగ్ కాలజీలో, భూపాలపల్లి నియోజకవర్గ ఓట్ల లెక్కింపును స్థానిక అంబేద్కర్ స్టేడియంలో, ములుగు నియోజకవర్గం ఓట్ల లెక్కింపును జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 17 రౌండ్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 18 రౌండ్లు, పరకాల 17 రౌండ్లు, నర్సంపేట 21 రౌండ్లు, వర్ధన్నపేట 20 రౌండ్లు, ములుగు 22 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు.

### ఊరేగింపులపై నిషేధం..

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు ఆంక్షలు విధించారు. 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రోడ్లపై ర్యాలీలు, టపాసులు కాల్చడం, ఊరేగింపులపై నిషేధం విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం మద్యం దుకాణాలు బంద్ చేయనున్నారు. ఎలక్షన్ కమిషన్ అనుమతి లేకుండా డీజేలను వినియోగించరాదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసుల హెచ్చరిస్తున్నారు. అయితే ఎలక్షన్ కమిషన్ అనుమతితోనే విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

### ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి..

వరంగల్ లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రకటించారు. వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపునకు మొత్తం 250మంది అధికారులను నియమించినట్లు వెల్లడించారు. ప్రతి టేబుల్ కు ఒక సూక్ష్మ పరిశీలకుడు, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ ఉంటారన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. అంతకుముందు సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎస్.షణ్మగ రాజన్ నర్సంపేట, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో కౌంటింగ్ ఏర్పాట్ల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్ ఓలు షేక్ రిజ్వాన్ బాషా, అశ్విని తానాజీ వాఖెడే, కృష్ణ వేణి, ఏఆర్ ఓలు, నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు, తదితరులు ఉన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం సందర్శించారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, రిటర్నింగ్ అధికారులు శ్రీనివాస్, రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.







# ఘనంగా అయ్యప్ప పడిపూజ

## తరలి వచ్చిన భక్తులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని 27వ డివిజన్ రాంకీ ఇంక్లైన్ లో శనివారం కోరే వెంకటస్వామి నివాసంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు 300 పైగా అయ్యప్ప స్వాములు పూజలో పాల్గొని అయ్యప్ప స్వామి పాటలు పాడుతూ భజన చేశారు. దీంతో కాలనీ అంతా అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఈ పడిపూజ కార్యక్రమంలో కొల్లూరి యోగానంద్ గురుస్వామి బృందంతో పాటలు పాడుతూ స్వాములను, కాలనీవాసులను ఆకట్టుకున్నారు. గురు స్వామి వెల్దే ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో పూజా విధానం జరిపించారు. హరిహర పుత్ర అయ్యప్ప కుటీరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోరే కుమారస్వామి, రవీందర్, కమలేష్, వేదాంత, కనిష్క చిట్ల ప్రభాకర్, గుత్తికొండ నవీన్, కేంచ కుమారస్వామి, కంచ సారయ్య, మండల రవి, దనిసిరి బుచ్చయ్య , కంచ మల్లయ్య గురుస్వామి, అమ్మ రాజ్ కుమార్,కెంచ లక్ష్మి, మండల నరసింహారాములు, పోతరాజు రామకృష్ణ, నంద రమేష్, కత్తెరపెల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.





# రేపు ఏవీవీ విద్యా సంస్థల..
# వ్యవస్థాపక దినోత్సవం

## సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవంతో పాటు పోతన జయంతి వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిం చేందుకు విద్యా సంస్థల పాలక వర్గం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఏవీవీ విద్యా సంస్థ తొలున ఉన్నత పాఠశాలగా, ఆ తర్వాత జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, పీజీ కళాశాలగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటలనుంచి ఏవీవీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగబండి నరసింహా రావు అధ్యక్షతన వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఏవీవీ పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి మన్నెం నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అదే విధంగా పోతన జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం నిర్వహించనున్న కార్యక్రమాలకు ఏవీవీ సంఘం పాలకవర్గ సభ్యుడు ఆచార్య ఎస్ ఎస్ వి ఎన్.శర్మ అధ్యక్షత వహించగా, హిందూ కళాశాల సంస్కృత విభాగం ఆచార్యులు దీవి నరసింహ దీక్షిత్ ఉపన్యాసకులుగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానంతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పాలకవర్గం ప్రకటించింది.

# విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

## వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ వాయిస్, క్రైం :** ఓట్ల లెక్కంపు సందర్భంగా ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, వేడుకలకు అనుమతులు లేవని సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికలకు సంబందించి ఫలితాలు వెలుబడనున్న నేపథ్యంలో అందరూ ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ ఆమలులో ఉన్నందున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, వేడుకలను నిర్వహించుకోరాదన్నారు. బాణా సంచా కాల్చడం, డీజే వినియోగం, ద్విచక్ర వాహన ర్యాలీలు, ఇతర ర్యాలీలతో పాటు సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, గుంపులుగా తిరగడం నిషేదించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలతో పాటు ఓటమి పాలైన పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం సమన్వయంతో వ్యవహరిస్తూ పోలీసులకు పూర్తి సహకారాన్ని అందించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.

## కొయ్యూరు ఎన్‌కౌంటర్‌కు 24ఏళ్లు

### వారం రోజుల పాటు పీఎల్‌జీఏ వారోత్సవాలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** సంచలనాల కొయ్యూరు ఎన్ కౌంటర్ కు నేటితో 24సంవత్సరాలు పూర్తయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుత భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూరు సమీపంలోని నాగులమ్మ అటవీ ప్రాంతంలో 1999 డిసెంబర్ 2న జరిగిన ఎన్ కౌంటర్ లో అప్పటి మావోయిస్ట్ అగ్ర నేతలు నల్లా ఆదిరెడ్డి, ఎర్రం రెడ్డి సంతోష్ రెడ్డి, శీలం నరేష్ ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఆ ఎన్ కౌంటర్ దేశ వ్యాప్తంగా సంచలనమైంది. ఈ ఎన్ కౌంటర్ మావోయిస్ట్ పార్టీకి తీరని లోటుని మిగిల్చింది. మావోయిస్ట్ అగ్ర నేతల సేవలను స్మరించు కోవడానికి సరిగ్గా ఏడాది తరువాత మావోయిస్ట్ పార్టీ 2000 డిసెంబర్ 2 న పీఎల్ జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ)ని ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం డిసెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజుల పాటు పీఎల్ జీఏ వారోత్సవాలు నిర్వహిస్తుంది. వారోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడనుండటంతో పోలీసులు పూర్తి స్థాయి భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. మంథని తూర్పు డివిజన్ మండలాలలో తనఖీలు ముమ్మరం చేసి అనుమానితులను ప్రశ్నించి వదిలేస్తున్నారు. గత రెండు నెలలుగా ఎన్నికల బందోబస్తులో ఉన్న పోలీసులకు ఇప్పుడు పీఎల్ జీఏ వారోత్సవాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

## కోస్కియుస్కో పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్ నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఆస్ట్రేలియాలోని ఎత్తైన శిఖరమైన కోస్కియుస్కో పర్వతాన్ని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని భూక్య తండాకు చెందిన యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ నాయక్ శుక్రవారం అధిరోహించాడు. యశ్వంత్ నాయక్ తో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్ లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన శిఖరాలను అధిరోహించే లక్ష్యంతో ముందుకు వెళుతున్న యశ్వంత్ నాయక్ కు ఇది మూడో శిఖరాగ్ర అధిరోహణ కావడం గమనార్హం. ఇప్పటికే ఈ సంవత్సరం ప్రారంభంలో ఆఫ్రికాలోని ఎత్తైన శిఖరం కిలిమంజారో, ఐరోపాలో ఎత్తైన ఎల్బ్రస్ పర్వతాన్ని భూక్యా యశ్వంత్ నాయక్ అధిరోహించాడు. ఈ సందర్భంగా యశ్వంత్ నాయక్ తల్లిదండ్రులు జ్యోతి రామూర్తి నాయక్ లు, తండా వాసులు, గ్రామస్తులు అభినందించారు.

## ఒక్క ధాన్యం గింజ కొనలే?



**వరంగల్ వాయిస్, మల్హర్ :** రైతులు తమ ఖరీఫ్ సీజన్ వరి పంట కోసి ధాన్యాన్ని నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రాల కు తీసుక వచ్చినప్పటికి ఇప్పటి వరకు మండలంలో ఏ ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రంలో కూడా కొనుగోళ్లు మొదలు కాకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎన్నికల హడావిడిలో ఉండి ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించలేదని దీంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పెరిగిపోయాయని, నెల రోజుల నుంచి ధాన్యం అరబెట్టడానికి పరదాల ఖర్చు తడిసి మోపెడు అవుతుందన్నారు. మరో పక్క వరికోతలు ముమ్మరంగా కొనసాగుతుండటం వలన కొత్తగా వచ్చిన వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి కొనుగోలు కేంద్రాలలో స్థలం సరిపోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొయ్యూరు కొనుగోలు కేంద్రానికి నేడు కొనుగోళ్లు ప్రారంభమైనప్పటికీ వేగంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం




**వరంగల్ వాయిస్, ఐనవోలు :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఐనవోలు మండలం, పెరుమాండ్ల గూడెం గ్రామంలోని గ్రామపంచాయతీలో వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిల ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరాన్ని పెరుమాండ్లగూడెం గ్రామ సర్పంచ్ పిడుగు రజిత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని, ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం కోరింది. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్ క్రాస్ హనుమకొండ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆరోగ్య శిబిరంలో గ్రామ కార్యదర్శి సదానందం, రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జి.కిషన్ రావు, డా.టి.మదన్ మోహన్ రావు, డా.మొహమ్మద్ తాహెర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, సాగర్, అనిల్, కేశోజు రమేష్, పోశాలు, గ్రామస్తులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దాసాంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్పలకు అన్నదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని పెగడ పల్లి డబ్బాలు క్రాస్ వద్ద గల శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్పల మాలాధారులకు సామూహిక అన్నదాన కార్యక్రమం గత వారం రోజులు క్రితం ప్రారంభించారు. శనివారం ఐదో రోజు అన్నదానం చేశారు. దాదాపు 150 మంది అయ్యప్ప మాలధారులకు భిక్షను అందించారు. నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి విశేష కృషి చేస్తోంది. అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేసేందుకు ఆసక్తి గల వారు దాసాంజనేయ స్వామి దేవాలయంలో దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి వారిని సంప్రదించాలని కోరారు. అలాగే సామూహిక పడిపూజ చేసేందుకు కూడా కృషి చేస్తున్నామని దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు.

## విద్యతోనే ముందడుగు

### డాక్టర్ పరికిపండ్ల అశోక్



**వరంగల్ వాయిస్,మహబూబాబాద్ :** విద్య అనే నిచ్చేనతో విద్యార్థి జీవితంలో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని, కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ సామాజికవేత్త, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం నాడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షల కోసం తయారవుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.300 విలువ చేసే ఉచిత మెటీరియల్, నోట్ బుక్స్, పెన్నులను ఎన్ఎఫ్ హెచ్ సీ ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు తయారవుతున్న విద్యార్థులకు ఉచితంగా ఆన్ లైన్ కోచింగ్, గైడెన్స్ అందివ్వనున్నట్లు, వివరాలకు ఫోన్ నెంబర్ 9989310141 లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎన్ఎంఎంఎస్ ఇంచార్జి సునీత, ఉపాధ్యాయ బృందం గిరిజ, శ్రీవాణి, వసంత, విజయకుమార్, సుచిత్ర, సునీత, సంజీవ, విజయలక్ష్మి, మంజుల, రాణి, సంధ్యారాణి, శ్వేత, రజియా, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు

### సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనంత పెద్ద ఎత్తున డబ్బు పంపిణీ,అవినీతి అక్రమాలు జరిగాయి. అధికార పార్టీ, ప్రత్యక్ష పార్టీలు పోటీపడి ప్రజలను ప్రలోభ పెట్టడానికి శతవిధాల ప్రయత్నించాయి. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండే బూత్ ల వారీగా ప్రచారానికి తమ కార్యకర్తలకు ద్వారా వేల రూపాయలను విచ్చలవిడిగా పంపిణీ చేశారు. సభలకు, సమావేశాలకు, విందులు, వినోదాలకు పెద్ద మొత్తంలో ఖర్చు చేయడమే కాకుండా అధికార దుర్వినియోగానికి సైతం పాల్పడ్డారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని, నియమ నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని చెప్పిన ఎన్నికల కమిషన్ ప్రధాన పార్టీల డబ్బు పంపిణీని, అక్రమాలను అడ్డుకోవడంలో విఫలమైంది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే పద్ధతిలో ఈసారి రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి. సామాన్యుడికి అందుబాటులో లేని ఖరీదైన వ్యాపకంగా మారిన ఎన్నికల్లో న్యూడెమోక్రసీ రెండు సంస్థలు ఐక్యంగా పోటీ చేశాయి. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భట్టు భిన్నమ్మను అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి పార్టీ శ్రేణులు కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. సాదాసీదాగా నిర్వహించిన మా ప్రచారానికి ప్రజల ఆదరణ లభించింది. అధికార ప్రత్యక్ష పార్టీల డబ్బు పంపిణీని ప్రలోభాలను తిరస్కరించి మా ప్రచారంలో పాల్గొన్నారు. డబ్బును, ప్రలోభాలను తిరస్కరించి స్వచ్ఛందంగా ప్రజలు మా పార్టీకి ఓట్లు వేశారు. స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ అభ్యర్థి భట్టు భిన్నమ్మకు ఓట్లు వేసిన ప్రజలకు జేజేలు తెలియజేశారు. ఎన్నికలలో ఎవరు గెలిచినా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వాలు కార్పొరేట్ సభ్యులకు సంపన్న వర్గాలకు ఊడిగం చేస్తాయి తప్ప, ప్రజల సమస్యలను పరిష్కరించలేవు. బలమైన ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజలు తమ హక్కులను నిలబెట్టుకోగలుగుతారు, సమస్యలను లెవనెత్తగలరని తెలిపారు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రజలు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# కల్వర్టు నిర్మాణం చేపట్టాలని రైతు ఆందోళన

## మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయింపు
## ముస్తఫాపూర్ గ్రామంలో ఘటన



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టు నిర్మించాలని ఓ రైతు మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగిన ఘటన మండలంలోని ముస్తఫాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామం నుంచి కొత్తకొండ గ్రామానికి నూతన రహదారి నిర్మాణం గత కొన్ని రోజులుగా జరుగుతుంది. కాగా మండలంలోని ముస్తఫాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు సుధాకర్ రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టాలని గత కొన్ని రోజులుగా కాంట్రాక్టు నిర్వాహకులను చెప్పుకుంటూ వచ్చారు. దీంతో కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో శనివారం పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి, రోడ్డు పనులను ఆపాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏనుగు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తన వ్యవసాయ పొలం వద్ద గతంలో కల్వర్టు ఉండేదని,రోడ్డు నిర్మాణంలో కల్వర్టు నిర్మాణం చేపట్టకపోతే తన వ్యవసాయ పొలం నీటిలో మునిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డును సుమారు 4మీటర్ల వరకు ఎత్తు పెంచితే పంట పొలాల్లో నీళ్లు నిలిచే ప్రమాదం ఉందని, కల్వర్టుల నిర్మాణం చేపడితే పంట పొలాలలో ఆగిన నీరు కిందికి వెళ్తాయని తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని సంబంధిత కాంట్రాక్ట్ నిర్వాహకులకు చెప్పిన పట్టించుకోవడం లేదని మండిపడ్డాడు. కల్వర్టు నిర్మాణం చేపట్టకుంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తన సమస్యను ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## నాయిని గెలవాలని ప్రత్యేక హెూమం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** అంబేద్కర్ విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రాము ఆధ్వర్యంలో ఈ నెల 30న జరిగిన ఎన్నికల సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నాయిని రాజేందర్ రెడ్డి ఈ నెల 3న జరగబోయే ఎన్నికల ఫలితాలలో విజయం సాధించాలని కాజీపేట శ్వేతార్క గణపతి దేవస్థానంలో ప్రత్యేక హెూమం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బ రాము మాట్లాడుతూ నాయిని రాజేందర్ రెడ్డికి శ్వేతార్క మూల గణపతి దేవుడి ఆశీస్సులతో, పశ్చిమ నియోజకవర్గంలో కనీ విని ఎరగని బ్రహ్మాండమైన విజయం ఆ గణపయ్య ఆశీస్సులతో సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెట్ పెల్లి దేవిక, రిహన్, సత్తార్, తాజ్, నిఖిత, రాజ్ కుమార్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కుంకుమేశ్వరాలయంలో నిత్యాన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో సుప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహా రుద్ర యాగ సహిత ఆకాశ దీపోత్సవ మహా అన్నదాన మహెూత్సవాలు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్ కుమార్ శర్మ ఆచార్యత్వమున అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి నేటి వరకు శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో నిత్యం మహా అన్నదాన కార్యక్రమాలను దాతల సహాయ సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. నిత్య అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కట్టంగూరి సరిత –సత్య నారాయణ రెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు. పరకాల చెందిన రామిని ధనలక్ష్మి –శ్రీశైలం దంపతులు స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తో పాటు ధర్మకర్తల మండలి ఆలయ వంశానుగత అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణ శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వెంకటయ్య, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీధర్ బాబు గెలుపు కోరుతూ పూజలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** రేపు జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపులో మంథని నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన దుద్దిల్ల శ్రీధర్ బాబు అత్యధిక మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తూ మండల కాంగ్రెస్ నాయకులు కొయ్యూరులోని నాగులమ్మ దేవాలయం, కాటారం మండలం దన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కొండ రాజమ్మ, వల్లెంకుంట ఎంపీటీసీ ఏనుగు నాగరాణి, మహిళ నాయకులు గుంటి సమ్మక్క, వేల్పుల రజిత, ఎడ్ల పోసక్క, వేల్పుల కమల, ఎడ్ల లక్ష్మి, గడ్డం సునీత, సీనియర్ నాయకులు నార రామ చంద్రం, కొడిపెల్లి సమ్మయ్య, వేల్పుల వెంకట స్వామి, గడిపెల్లి సదు, కొండ రమేష్, గడ్డం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవాలకు సిద్ధంగా ఉండండి
### హుస్నాబాద్‌లో పొన్నం విజయం పక్కా



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలకు సిద్ధంగా ఉండాలని, హుస్నాబాద్ నియోజవర్గంలో పొన్నం ప్రభాకర్ విజయకేతనం ఎగురవేస్తున్నారని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చునూరి కర్ణాకర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని ముల్కనూర్ గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ 20వేల మెజార్టీ తో గెలుపొందనున్నారని జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 68 నుంచి 76 అసెంబ్లీ సీట్లతో అధికారంలోకి రాబోతుందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు, ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, యువకులు, మహిళలు మార్పు కోసం కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వము తొమ్మిది సంవత్సరాలుగా అధికారంలో ఉండి, ప్రజలకు చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు .ప్రజలకు విరక్తి చెంది, కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తున్నారని, ప్రజలు కోరుకున్న మార్పు నెరవేరనుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చాగంటి వెంకటేశ్వర్లు, దండేపల్లి కమలాకర్,జయకృష్ణ, గంగారపు రాజు, ఎలుకపల్లి శ్రీనివాస్,ఆనందం,రామారావు, రాకేష్, సదానందం, పచ్చునూరి సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ర్యాలీలు తీయొద్దు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎలక్షన్ కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, డీజేలు, బాణాసంచాలు కాల్చడం చేయకూడదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఇన్ స్పెక్టర్ కరుణాకర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఇన స్పెక్టర్ కరుణాకర్ రావు మాట్లాడుతూ ఈ నెల 3న ఎలక్షన్ కౌంటింగ్ ఉంది. కాబట్టి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 144సెక్షన్ అమలులో ఉంది, కాబట్టి ఎలక్షన్ కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు గానీ, డీజేలు గానీ, బాణసంచా కాల్చడం గానీ చేయకూడదన్నారు. అలాగే నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదన్నారు. ఎలక్షన్ ఫలితాలు తర్వాత ఎలక్షన్ కమిషన్ అనుమతితో మాత్రమే విజయోత్సవం ర్యాలీలు నిర్వహించుకోవాలని హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు ఇన్ స్పెక్టర్ సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రేపు శాయంపేటలో 144 సెక్షన్ విధింపు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రేపు ఎలక్షన్ కౌంటింగ్ జరగనుంది. కాబట్టి ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలమంతా 144 సెక్షన్ విధించబడింది. ఈ నేపథ్యంలో ఎలాంటి ర్యాలీలకు గాని, ఎలాంటి డీజేలకు గాని, బాంబులు పేల్చడానికి, నలుగురి కంటే ఎక్కువమంది గుమి కూడడం గాని నిషేధించబడినట్లు శాయంపేట ఎస్సై దేవేందర్ తెలిపారు. 24గంటల తర్వాత పర్మిషన్ తీసుకొని సంబరాలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## ర్యాలీలు, డీజేలు, బాణసంచా కాల్చడం నిషేధం

**వరంగల్ వాయిస్, కేయూ :** ఎలక్షన్ కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, డీజేలు, బాణా సంచాలు కాల్చడం చేయకూడదని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేయూ ఇన్ స్పెక్టర్ అబ్బయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఇన్ స్పెక్టర్ అబ్బయ్య మాట్లాడుతూ ఈ నెల 3న ఎలక్షన్ కౌంటింగ్ ఉంది కనుక, ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కాబట్టి ఎలక్షన్ కమిషన్ అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు గానీ, డీజేలు గానీ, బాణసంచా కాల్చడం గాని చేయకూడదన్నారు. అలాగే నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదన్నారు. ఎలక్షన్ ఫలితాలు తర్వాత ఎలక్షన్ కమిషన్ అనుమతితో మాత్రమే విజయోత్సవం ర్యాలీలు నిర్వహించుకోవాలని కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు ఇన్ స్పెక్టర్ సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 24 గంటల తర్వాతే సంబరాలు



**వరంగ్గల వాయిస్, వర్ధన్నపేట :** రేపు ఎలక్షన్ కౌంటింగ్ ఉన్నందున ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలమంతా 144 సెక్షన్ విధించబడుతుందని మండలం ప్రజలందరికీ వర్ధన్నపేట పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాబట్టి ఎలాంటి ర్యాలీలకు, డీజేలు గానీ, ఎలాంటి బాంబులు పేల్చడానికి గానీ, నలుగురి కంటే ఎక్కువమంది గుమి కూడడం నిషేధించినట్లు తెలిపారు. 24గంటల తర్వాత పర్మిషన్ తీసుకొని సంబరాలు చేసుకోవచ్చున వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు.

## అధికారికంగా కొత్త వైన్ షాప్‌లు ప్రారంభం
### సరైన స్టాక్ లేక మద్యం ప్రియుల నిట్టూర్పు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** కొత్తగా టెండర్లు దక్కించుకున్న వైన్ షాప్ లు పరిమిత స్టాక్ తో దర్శనం ఇస్తున్నాయి. పాత మద్యం షాప్ ల గడువు గత నెల 30వరకు ఉండగా ఎన్నికల నేపథ్యంలో 29,30 తేదీ లలో ఎన్నికల నిబంధనల మేరకు వైన్ షాప్ లు మూసి ఉంచాల్సి రావడం, వైన్ షాప్ ల గడువు కూడా 30తో ముగియనుండటంతో పాత వైన్ షాప్ ల యజమానులు నాలుగు రోజుల ముందు గానే షాప్ లలో స్టాక్ మొత్తం ఖాళీ చేసి వెళ్లి పోయారు. గత ఆగస్టు నెలలో జరిగిన మద్యం టెండర్లలో కొత్త వైన్ షాప్ లు దక్కించుకున్న యజమానులు అధికారికంగా డిసెంబర్ 1 నుంచి షాప్ లు ప్రారంభించాల్సి ఉన్న 3న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల లెక్కింపు ఉండటం మూలంగా ఆరోజు వైన్ షాప్ లు బంద్ చేయాల్సి రావడంతో పాటు ఎన్నికలలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో.. వారు మద్యం పాలసీ పై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో అనే అంశాలను బేరీజు వేసుకొని దానికి అనుగుణంగా వైన్ షాప్ లు ఓపెన్ చేయడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. మల్హార్ మండలంలో కొయ్యూరు, తాడిచెర్లలో రెండు మద్యం షాప్ లు శుక్రవారం అధికారికంగా ఓపెన్ అయినప్పటికీ పరిమిత స్టాక్ తో దర్శనం ఇస్తున్నాయి. నూతనంగా వైన్ షాప్‌లు దక్కించుకున్న యజమానులు వేచి చూసే దోరణి అవలంభిస్తుండటం,ఎన్నికల కోడ్ నేపథ్యంలో అటు గ్రామాల్లో బెల్ట్ షాపు లు మూత పడటం ,ఇటు కొత్త వైన్ షాప్ ల లోకి సరైన స్టాక్ రాకపోవడంతో మద్యం ప్రియులు ఎం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

# దూసుకుపోతున్న యానిమల్




రణ్‌బీర్ కపూర్ నటించిన యానిమల్ చిత్రం భారీ అంచనాల మధ్య శుక్రవారం విడుదలైంది. సినిమా నిడివి, వయొలెన్స్ ఎక్కువ ఉండడంతో ఓ వర్గం ప్రేక్షకుల నుంచి కాస్త మిశ్రమ స్పందన వచ్చినా కలెక్షన్ల పరంగా బాక్సాఫీస్ దగ్గర దుమ్ముదులిపేస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే సత్తా చూపిన ఈ చిత్రం ఫస్ట్ డే కలెక్షన్లలోనూ సత్తా చాటింది. ఢిల్లీలో 1318 షోలు పడగా 79 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. ఢిల్లీలో 1040 షోలు, హైదరాబాద్‌లో 316 షోలు 82 శాతం ఆక్యుపెన్సీ, తమిళంలో 88 షోలు 30 శాతం ఆక్యుపెన్సీతో తొలిరోజు ముగిసింది. దేశవ్యాప్తంగా హిందీలో 54.78 కోట్లు, దక్షిణాదిలో రూ.9.05 కోట్లు వసూళ్లు రాబట్టగా మొత్తంగా చూస్తే తొలి రోజు ఈ చిత్రం 63.80 కోట్లు వసూళ్లు రాబట్టినట్లు బాలీవుడ్ ఎనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. 'సెలవు రోజులు కాదు, ఫ్రాంఛైజ్ సినిమా కాదు, భారీ కామియో ఆర్టిస్ట్‌లు లేరు, అడల్ట్ సర్టిఫికెట్ చిత్రం, మూడు గంటలకుపైగా నిడివి, మరో సినిమాతో పోటీ అయినా మొదట రోజు కలెక్షన్లు అదరగొట్టింది. రణ్‌బీర్‌కి భారీ ఓపెనింగ్స్ చిత్రమిది' అని తరణ్ ఆదర్శ్ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది విడుదలైన భారీ చిత్రాల్లో ఫస్ట్ డే కలెక్షన్ల పరంగా టాప్ 5 చిత్రాలు తీసుకుంటే షారుక్‌ఖాన్ జవాన్ 65.50 కోట్లు, పఠాన్ రూ.57 కోట్లు, యానిమల్ 54.75 కోట్లు, కేజీఎఫ్ 53.95 కోట్లు, వార్ 51.30 కోట్లు వసూళ్లు రాబట్టాయి. తాజాగా విడుదల యానిమల్ చిత్రం మూడో స్థానంలో ఉంది.

# గంట, రెండు గంటలు టైమ్ చాలు..

## నటుడు నితిన్ సంచలన వ్యాఖ్యలు

శ్రీలీల ఇప్పుడు టాలీవుడ్ లో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది, దానికితోడు ఆమె వరస సినిమాలు ఒప్పుకుంటోంది. అందువలన ఆమె చాలా బిజీ అయిపోవటమే కాకుండా, ఒక సినిమాకి ఒకరోజు కాదు, కొన్ని గంటలు కేటాయిస్తే అదే పెద్ద విషయం అన్నట్టుగా అయిపోయింది. ఇదే విషయాన్నీ నటుడు నితిన్ కూడా చెపుతున్నాడు. నితిన్, శ్రీలీల జంటగా 'ఎక్స్‌ట్రా–ఆర్డినరీ మ్యాన్' సినిమా డిసెంబర్ 8న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. వక్కంతం వంశిదీనికి దర్శకుడు, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి నిర్మాత. శ్రీలీలతో చేస్తున్నప్పుడు మీకు ఎంటువంటి ఛాలెంజ్ ఎదురైంది అని నితిన్ ని అడిగితే, అతని సమాధానం అందరికీ నవ్వు తెప్పించింది. ఆమె మా సినిమాకి ఎన్ని గంటలు కేటాయిస్తుంది, షూటింగ్ కి ఎప్పుడు వస్తుంది అనేదే పెద్ద ఛాలెంజ్ అని సమాధానం చెప్పాడు నితిన్. 'ఆమె డేట్స్ ఇస్తే చాలు అదే మాకు ఛాలెంజ్. ఒకవేళ డేట్స్ ఇచ్చినా ఎన్నిగంటలు ఇస్తుంది రెండు గంటలా, మూడు గంటలా, ఒకవేళ రెండు గంటలు మాత్రమే మా షూటింగ్ కి కేటాయిస్తుంది అని తెలిస్తే, ఆ రెండు గంటలకి సరిపడా ఎటువంటి సన్నివేశాలు రాసుకోవాలి, దానికి ఎలా ప్రిపేర్ అవ్వాలి అన్నదే మా ఛాలెంజ్,' అని నితిన్ సెటైరికల్ గా చెప్పాడు. ఆమె డాన్సులు చాలా బాగా చేసిందని, అందుకోసం తాను కూడా బాగా డాన్సులు చెయ్యాల్సి వచ్చిందని చెప్పాడు నితిన్. 'ఆమె డాన్సులకి నేను మ్యాచ్ అయ్యేట్టు చెయ్యాలి అంటే నేను కూడా కొంచెం ప్రిపేర్ అవ్వాలి కదా, లేదంటే ఏంటి నితిన్ డాన్సుల్లో వెనక పడ్డాడు అని మీరే అంటారు, అందుకని ఆమె డాన్సులకి మ్యాచ్ అయ్యేట్టు నేను కూడా డాన్సులు చేసాను,' అని చెప్పారు నితిన్. మరి శ్రీలీల డేట్స్ అంత ఇబ్బందిగా వుండి, ఆమె దొరకడమే కష్టం అనుకున్నప్పుడు ఆమెనే మళ్ళీ నితిన్ తదుపరి సినిమాలో కూడా పెట్టుకున్నారు ఎందుకు? ఆ సినిమాలో ముందు రష్మిక అనుకున్నారు, కానీ ఆమె తేదీలు ఇవ్వడం కష్టం అయిందని, శ్రీలీలని పెట్టుకున్నారు, ఈమె కూడా చాలా బిజీ అయిపోయింది అంటున్నారు కదా, అన్నదానికి నితిన్ సమాధానం వింటే షాక్ అవుతారు. 'అప్పుడు మా 'ఎక్స్‌ట్రా–ఆర్డినరీ మ్యాన్' దర్శకుడుకి కూడా చెప్పాము, వినలేదు, అనుభవించాం, అలాగే నా రాబోయే సినిమా దర్శకుడు వెంకీ కి కూడా చెప్పాము, అతను కూడా వినిపించుకోలేదు, మేము అనుభవించిన బాధ అతను కూడా అనుభవిస్తే అప్పుడు తెలుస్తుంది,' అని నితిన్ సమాధాం ఇచ్చి, అందరినీ నవ్వించాడు.

### ఒలే ఒలే పాపాయి'సాంగ్ విడుదల

టాలీవుడ్ హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోండగా.. సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబరు 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన టీజర్ ట్రైలర్‌లు అభిమానులను ఇంప్రెస్ చేస్తున్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ మాస్ సాంగ్ వదిలారు.
ఈ మూవీ నుంచి 'ఒలే ఒలే పాపాయి' అంటూ సాగే మాస్ ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను రామ్ మిర్యాల, ప్రియ ఆలపించగా.. హ్యారిస్ జయరాజ్ సంగీతం అందించాడు. జానీ మాస్టర్ డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. ఇక ఈ పాటకు సంబంధించి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 4న విడుదల చేయనున్నారు. కామెడీ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. యాంగ్రీ యంగ్ మ్యాన్ డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని నితిన్ హోం బ్యానర్ శ్రేష్ఠ్ మూవీస్‌పై సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీలో నితిన్ స్మగ్లర్‌గా కనిపించనున్నట్టు సమాచారం.








# సిల్క్ స్మిత జీవితంపై మరో సినిమా

## ది అన్‌టోల్డ్ స్టోరీ పేరుతో తాజాగా చిత్రనిర్మాణం

గ్లామర్ డాల్‌గా వెండితెరపై ఓ వెలుగు వెలిగారు సిల్క్‌స్మిత అలనాటి స్టార్ హీరోలతో ఎన్నో ఐటెమ్ సాంగ్స్‌లో నటించారు. పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. వృత్తిపరంగానూ, వైవాహిక జీవితంలోనూ చేదు సంఘటనలు ఎదుర్కొన్న ఆమె 1996 సెప్టెంబర్ 23న ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంలో ఎన్ని సవాళ్లను ఎదుర్కొన్నారు. చివరకు వాటిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో 'డర్టీ పిక్చర్' తెరకెక్కింది. సిల్క్‌స్మితగా విద్యాబాలన్ నటించారు. ఇప్పుడు మరోసారి సిల్క్ జీవిత కథ తెరపై కనిపించనుంది. చంద్రికా రవి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. జయరామ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'సిల్క్ స్మిత.. ది అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం సిల్క్ స్మిత జయంతిని పురస్కరించుకుని చిత్రబృందం తాజాగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో చంద్రిక.. సేమ్ స్మితలాగే కనిపించారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కు తోన్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. చంద్రికా రవి 'వీర సింహారెడ్డి' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్‌లో కనిపించి మెప్పించారు.

# ఎగ్జిట్ పోల్స్ పై అనుమానాలు

**వాటిలో శాస్త్రీయత ఎంత అన్నది ప్రశ్నార్థకమే**

**కాంగ్రెస్‌లో ఉత్తేజం**

**అధికారం మనదే అంటున్న బీఆర్ఎస్**

**కేబినెట్ సమావేశంపై ఉత్కంఠ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 15నుంచి 20 సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయగా వాటిలో భిన్నంగా ఓటరు నాడిని వెల్లడించాయి. అత్యధికంగా కాంగ్రెస్ కు అధికారం అని చెప్పినా వీటిపై పలువురు విశ్లేషకులు మాత్రం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు సాయంత్రం 5గంటలకే పోలింగ్ ముగియగా 5.30 గంటలకే సిద్ధంగా ఉంచుకున్న ఎగ్జిట్ పోల్స్ ను విడుదల చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఎలా సాధ్యమన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. కొన్ని పోలింగ్ బూత్ లలో రాత్రి 9 గంటల వరకు కూడా ఆయా బూతుల ఆవరణలో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### శాస్త్రీయత ఎంత..?

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు అభిప్రాయ సేకరణ జరిపితే వాటిని కేవలం 30 నిమిషాల్లోనే ఆయా సంస్థలు ఎలా లెక్కకట్టాయన్న దానిపై బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో బూత్ ల వారీగా సేకరించిన షాంపిల్స్ స్థాయి ఎంత అన్నదానిపై అయోమయం నెలకొంది. ఏయే వయస్సు వారినుంచి ఏ స్థాయిలో వివరాలు సేకరించారనే వాటిపై సంస్థలనుంచి సమాధానం రావడం లేదు. ఇలాంటి అనుమానాల మధ్య విడుదలైన ఎగ్జిట్ పోల్స్ పై విశ్వసనీయత లేకుండా పోయింది. 2018 ఎన్నికల్లో సైతం అత్యధిక ఎగ్జిట్ పోల్స్ మహా కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పినా వాటికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. సర్వే సంస్థలలో అత్యధికంగా ఆయా పార్టీలకు చెందినవిగా ప్రచారంలో ఉంది. అయితే కొన్ని సంస్థలు మాత్రం గతంలో ఇచ్చిన సర్వేలు నిజమైన చరిత్ర ఉంది. రాజకీయ విశ్లేషకులు ఇలాంటి సంస్థల ఎగ్జిట్ పోల్స్ పైనే చర్చిస్తున్నారు.

### కాంగ్రెస్‌లో ఉత్తేజం..

అత్యధిక సర్వేలు కాంగ్రెస్ వస్తుందనడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. దీనికి అనుగునంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుకోవాలని సూచించడం, ప్రమాణ స్వీకారం తేదీ ప్రకటించడం, మంత్రి పదవులపై కూడా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితిలోనూ అధికారాన్ని వదులుకోవద్దన్న అభిప్రాయంలో ముందుకు సాగుతున్నారు.

### కేబినెట్ సమావేశంపై ఉత్కంఠ..

ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు సీఎంఓ కార్యాలయం నుంచి నోట్ విడుదల కావడంపై ఉత్కంఠ నెలకొంది. ఈ ప్రకటన బీఆర్ ఎస్ శ్రేణుల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని నివారించడానికా లేక విశ్వసనీయత గల సర్వేల్లో బీఆర్ ఎస్ కు అత్యధిక స్థానాలు వస్తాయన్న ధీమానా అన్న ప్రచారం సాగుతోంది. కేసీఆర్ ప్రకటనతో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై రాజకీయ వర్గాల్లో కొత్త అనుమానాలు మొదలయ్యాయి.

### బీఆర్ఎస్‌కే అనుకూలం..

మిషన్ చాణక్య సర్వే ఫలితాలు మాత్రం సింగిల్ లార్జెస్ట్ పార్టీగా బీఆర్ ఎస్ వస్తుందని ప్రకటించగా, నాగన్న సంస్థ మాత్రం బీఆర్ ఎస్ మ్యాజిక్ ఫిగర్ 60 దాటుతుందని ప్రకటించింది. 2018లోనూ ఈ రెండు సంస్థల ఫలితాలే వాస్తవికతకు దగ్గరగా ఉన్నాయి. ఈ రెండు సంస్థలు పోలింగ్ పూర్తయిన 24 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. ప్రతి బూత్ నుంచి 300మంది చొప్పున సుమారు 8,500 మంది ఓటర్ల అభిప్రాయాలను సేకరించాయని, వీటన్నింటినీ క్రోడీకరించి ఫలితాలను ఆలస్యంగా వెల్లడించినట్లు ఈ సంస్థలు ప్రకటించాయి. నాగన్న సర్వే ప్రకారం బీఆర్ ఎస్ కు 61నుంచి 68, కాంగ్రెస్ కు 34నుంచి 40, బీజేపీకి 3నుంచి 5, ఎంఐఎంకు 5నుంచి 7 స్థానాలు వస్తాయని ప్రకటించాయి. అదే విధంగా మిషన్ చాణక్య బీఆర్ ఎస్ కు 45నుంచి 55, కాంగ్రెస్ కు 35నుంచి 48, బీజేపీకి 6నుంచి 10, ఎంఐఎంకు 6నుంచి 7 స్థానాలు లభించే అవకాశం ఉందని వెల్లడించింది.

### 2018లో నిజమైన సర్వేలు..

2018 ఎన్నికల్లో అత్యధిక ఎగ్జిట్ పోల్ సర్వే ఫలితాలు మహాకూటమి విజయం సాధిస్తుందని చెప్పగా మిషన్ చాణక్య, నాగన్న సర్వేలు మాత్రం టీఆర్ ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పాయి. వీరు చెప్పినట్లే ఫలితాలు రావడంతో ఈ రెండు సంస్థలతపై విశ్వసనీయత పెరిగింది. అయితే ఈ రెండు సంస్థలు మాత్రమే బీఆర్ ఎస్ అధికారంలోకి వస్తుందని చెప్పగా, మిగిలిన సర్వేలన్నీ కాంగ్రెస్ కు అనుకూలంగా రావడంతో ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. కాగా కొన్ని సర్వే సంస్థలు తెలంగాణ ఫలితాలపై ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో జరుగుతున్న బెట్టింగ్ ల కోసం ఫేక్ ఫలితాలు ప్రకటించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదీ ఏమైనా ఆదివారం వెల్లడయ్యే ఫలితాలతో ఆయా సంస్థల విశ్వసనీయత వెల్లడికానుంది.

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్ రావు అధ్యక్షతన కాకతీయ మహిళా డిగ్రీ కళాశాల, హనుమకొండ నందు న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సదస్సులో హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ “విద్యార్థినులు వివిధ చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమాజంలో విద్యార్థినులపై, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై, వాటిని ఎదుర్కోవడానికి విద్యార్థినులకు మహిళలకు సహాయం చేయుటకు న్యాయ సేవాధికార సంస్థలు సదా అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థినులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు పొందాలని తెలిపారు. ర్యాగింగ్ లకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గృహ హింసా చట్టం, వరకట్న వేధింపుల చట్టాలు, మెయింటెనెన్స్ చట్టం తదితర మహిళా చట్టాల గురించి సవివరంగా వివరించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, హనుమకొండ కార్యదర్శి (న్యాయమూర్తి) ఉపేందర్ రావు న్యాయ సేవాధికార సంస్థల విధులు, లక్ష్యాల గురించి వివరించారు. ఈ సదస్సులో డిప్యూటీ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బోజేర్వు గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం ఇదే గ్రామానికి చెందిన రాధారపు గౌరయ్య (70) ఇతని భార్య వెంకటమ్మ గత 12 సంవత్సరాల క్రితం చనిపోయింది. ఇతడికి ఏడాది క్రితం కంటి ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆరోగ్యం సహకరించడం లేదు. దీంతో మనస్థాపానికి గురైన గౌరయ్య శుక్రవారం సాయంత్రం వేళలో తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటకు తరలించారు. మృతుడికి కుమారుడు యాకయ్య, ఇద్దరు కూతుళ్లు యాక లక్ష్మి, స్వరూపలు ఉన్నారు. మృతుడి కుమారుడు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

## పీఏసీఎస్ వైస్ చైర్మన్‌ను సస్పెండ్ చేయండి



**వరంగల్ వాయిస్, రఘునాథ్ పల్లి :** కంచనపల్లి పీఏసీఎస్ పరిధిలోని కుసుమయి తండా ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ మూడు ధర్మాను వెంటనే సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోలు విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. పలుమార్లు జిల్లా కలెక్టర్ కు , డీసీఓను కలిసి విన్నవించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సస్పెండ్ చేయకుంటే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే గత 2016 నుంచి ఈ సెంటర్ ను నిర్వహిస్తున్నమూడు ధర్మాను కాపాడేందుకు ఎమ్మెల్, చైర్మన్, అధికారులు వెనుకేసుకుని వచ్చి తమ వాటాలు తీసుకొని ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటివరకు విచారణలు చేపట్టి ఎలాంటి నివేదికలు చేయకుండానే దాన్ని కప్పిపుచ్చుతున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని వెంటనే సస్పెండ్ చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు గుగులోత్ కొమురెల్లి, ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, పేర్ని రవి, కురుమ కవటి, శ్రావణ్ యాదవ్, కుర్ర సుందర్ పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు స్కెచ్

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎస్సీ డిపార్ట్ మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు బంధు డబ్బులను, ఎలక్షన్ కోడ్ కారణంగా ఆగిన నేపథ్యంలో, ప్రభుత్వం పడిపోతుందని అందిన కాడికి దోచుకునే ఉద్దేశ్యంతో కమీషన్ ఇచ్చే కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్నారు. నిజంగా రైతుల మీద ప్రేమ ఉంటే రైతులకు ఇవ్వాలి కానీ, తెలంగాణను అభివృద్ధిలో వెనుక పడేశారు. పేదలకు ఇచ్చిన అసైన్డ్, ప్రభుత్వ భూములను బినామీ పేర్ల మీద వివిధ వ్యక్తులకు ధరణి ద్వారా తెలంగాణ మొత్తం, ముఖ్యంగా రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఎలక్షన్ కోడ్ కారణంగా ఏ పని ప్రభుత్వం చేయాలన్న ఈసీ అనుమతి తప్పనిసరి, కానీ అధికారులు ప్రభుత్వ డబ్బులను, భూములను ఆస్తులను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సామాన్య ప్రజలను పది సంవత్సరాల నుంచి కలవకుండానే పోయారాన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి రోజు సామాన్య ప్రజలను కలిసి వారి కష్టాలను తీరుస్తామన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్టాన్ని ప్రజలను కాపాడి అవివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

## కొండా సురేఖ గెలవాలని పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ తూర్పు అభ్యర్థి కొండా సురేఖ భారీ మెజారిటీతో గెలవాలని, అలాగే ఆమెకు మంత్రి పదవి రావాలని వంచనగిరి కోటగండి మైసమ్మ ఆలయంలో, సాయిబాబా మందిరంలో శనివారం వరంగల్ సిటీ మహిళ అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరి గిరి పుష్ప, 23వ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొండ శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచన రవి, 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, 22వ డివిజన్ యూత్‌మెంబర్ ఈసంపెల్లి మహేష్, జన్ను రవీందర్ పాల్గొన్నారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com